# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గాంధీజీ కలలుగన్న భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ❖ ప్రపంచ శాంతి, సుస్థిరతను సాధించడానికి భారత్, జమైకా దేశాలు కలసి పని చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ రక్షణ రంగంలో దేశం స్వావలంబన దిశగా పయనిస్తోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- ❖ దేశ వ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాలకు కేంద్ర హోం శాఖ 5 వేల 858.60 కోట్ల రూపాయలను విడుదల చేసింది.
- ❖ కాన్పూర్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన రెండవ టెస్టు క్రికెట్ మ్యాచ్ లో భారత్ విజయం సాధించింది.

==============================

గాంధీజీ కలలుగన్న భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. "జాతి పిత మహాత్మా గాంధీ" 155వ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ఈరోజు ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం, అహింసను మార్గాలుగా ఎంచుకున్న బాపూజీ జీవితం మొత్తం మానవాళికి ఆదర్శమని రాష్ట్రపతి అన్నారు. గాంధీజీ అంటరానితనం, నిరక్షరాస్యత, పారిశుధ్య లోపం, ఇతర సాంఘిక దురాచారాల నిర్మూలనకు, మహిళా సాధికారత కోసం అవిశ్రాంతంగా పోరాడారని అన్నారు. ఈ శుభ సందర్భంగా, సత్యం, అహింస, ప్రేమ, స్వచ్ఛత విలువలను అందరూ అలవర్చుకోవాలని రాష్ట్రపతి కోరారు.

==============================

ప్రపంచ శాంతి, సుస్థిరతను సాధించడానికి భారత్, జమైకా దేశాలు కలసి పని చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జమైకా ప్రధానమంత్రి డాక్టర్ ఆండ్రూ హోల్నెస్ తో జరిగిన ప్రతినిధి స్థాయి చర్చలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మొదటిసారిగా జమైకా ప్రధానమంత్రి భారత పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. జమైకాతో భాగస్వామ్యాన్ని పంచుకోవడానికి భారతదేశం సిద్ధంగా ఉందని, రక్షణ రంగంలో తన సహాయ సహకారాలను అందిస్తుందని నరేంద్రమోదీ పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో దేశం స్వావలంబన దిశగా పయనిస్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ 277వ వార్షిక దినోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రపంచంలోనే రక్షణ ఎగుమతిదారులలో భారత దేశం అగ్రగామిగా ఉందని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రక్షణ శాఖ వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. డిఫెన్స్ అకౌంటింగ్‌లో సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాలకు కేంద్ర హోం శాఖ రూ.5 వేల 858.60 కోట్ల రూపాయలను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ వాటాలో భాగంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి 14 రాష్ట్రాలకు ఈ మేరకు హోంశాఖ నిధులు మంజూరు చేసింది. పలు రాష్ట్రాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందాలు.. నష్టాన్ని అంచనా వేస్తూ ఇచ్చిన నివేదిక మేరకు తక్షణసాయంగా ఈ నిధులు కేటాయించింది. కేంద్ర బృందాల నుంచి పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని నిధులు మంజూరు చేయనున్నట్లు హోం శాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌కు 1,036 కోట్ల రూపాయలు, తెలంగాణకు 416.80 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు 1,492 కోట్ల రూపాయల వరద సాయం ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్ తరాలకు బలమైన సాంస్కృతిక పునాది వేయడానికి పాతతరం సేవలను గుర్తించడం చాలా అవసరమని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం - 2024 సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజాన్ని రూపొందించడంలో వృద్ధులు కీలక పాత్ర పోషిస్తారని, వారి గౌరవం, శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వచ్చే ఏడాది పాఠశాలల్లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించాలని యోచిస్తున్నామని కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో, సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బిఎల్ వర్మ మాట్లాడుతూ... వృద్ధులను సంరక్షించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, దానిని తప్పక పాటించాలని అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హెజ్‌బొల్లాను నిర్వీర్యం చేసే లక్ష్యంతో లెబనాన్ లో ఆ గ్రూప్‌పై ఇజ్రాయెల్ వరుస దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో భూతల దాడులు చేపట్టేందుకు ఇప్పటికే ఇజ్రాయెల్ సేనలు ఆ దేశంలోకి ప్రవేశించాయని, ఈ తరుణంలో సరిహద్దు ప్రాంతాల్లోని లెబనాన్ పౌరులు తమ ఇళ్లను ఖాళీ చేసి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇజ్రాయెల్ ఆదేశించింది. దీనికి

సంబంధించిన ప్రకటనను ఆ దేశ సైన్యం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొంది. కాగా ఈ ప్రకటనపై హెజ్‌బొల్లా స్పందిస్తూ... ఇజ్రాయెల్‌తో ప్రత్యక్ష పోరాటానికి తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాన్పూర్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన రెండవ టెస్టు క్రికెట్ మ్యాచ్ లో భారత్ విజయం సాధించింది. 7 వికెట్ల తేడాతో రెండు మ్యాచ్‌ల సిరీస్ ను భారత్ 2 - 0 తేడాతో కైవసం చేసుకుంది. ఈ విజయంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్ ఇండియా అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. అంతేకాక వరుసగా 3వ సారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ కు వెళ్లేందుకు మార్గం సుగమం చేసుకుంది. భారత్ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడగా, ఇందులో 8 విజయాలు సాధించగా, ఒక మ్యాచ్ డ్రాగా నిలిచింది. కాగా ఇప్పటి వరకు 581 టెస్టులు ఆడిన భారత్ 180 మ్యాచుల్లో విజయం సాధించగా.. 178 టెస్టుల్లో ఓటమిపాలైంది. గత 12 ఏళ్లుగా భారత్ ఒక్క సిరీస్‌ను కోల్పోలేదు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పేదలు, చిన్న వ్యాపారులకు బ్యాంకు రుణం పొందడం ప్రస్తుతం సులభతరం అయ్యిందని, జన్ ధన్ యోజన వల్లే ఇది సాధ్యమైందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈరోజు ఈటానగర్‌లో జరిగిన క్రెడిట్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ... బ్యాంకుల నుండి ఎటువంటి తనఖా, సుదీర్ఘ డాక్యుమెంటేషన్ లేకుండా ప్రజలు ఈ పథకాలను పొందేలా ప్రధాన మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. సంక్షేమ పథకాలు వాస్తవంగా సామాన్య ప్రజలకు అందుతున్నాయా లేదా అని సమీక్షించేందుకు క్రెడిట్ ఔట్‌రీచ్ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వానికి సహాయపడుతుందని తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాల కింద 160 మంది లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేసే కార్యక్రమాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధారణంగా ముగిశాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి నష్టాలలో నిలిచాయి. సెన్సెక్స్ 33.49 పాయింట్ల నష్టంతో 84 వేల 266.29 వద్ద, నిఫ్టీ 1.50 పాయింట్ల నష్టంతో 25 వేల 809.35 వద్ద ముగిశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత 10 సంవత్సరాల్లో "స్వచ్ఛ భారత్ మిషన్" ఎన్నో విజయాలను సాధించిందని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో "స్వచ్ఛ భారత్ దివస్ 2024పై విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 24 లక్షలకు పైగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. "స్వచ్ఛతా హి సేవా అభియాన్" 2024లో ఇప్పటివరకు 20 కోట్ల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 38 లక్షల మందికి పైగా సఫాయి మిత్రలు ప్రచారంలో పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =